జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు



సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.

శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో

సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| మంగళవారం 17 ఫిబ్రవరి 2026 | పేజీలు : 04 | వెల : రూ 2/- | సంపుటి : 1 సంచిక : 261 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|


# కేంద్ర నిధుల సమీకరణపై సమగ్ర కార్యాచరణ – 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి: సిఎస్ ఆదేశాలు

## మార్చి లోగా రూ.15 వేల కోట్ల నిధుల సమీకరణకు ఆదేశం






సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈఓ, ఫిబ్రవరి 17: కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను సమీకరించుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, ఎస్ఎన్ఏ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు తదితర నిధులను మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఢిల్లీలో ప్రత్యేక అధికారిని నియమించి సమన్వయం పెంచాలని తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య, గిరిజన సంక్షేమ శాఖలకు కలిపి సుమారు రూ.15 వేల కోట్ల నిధులు రావాల్సి ఉన్నాయని, వాటిని రాబట్టి రాష్ట్రంలోని పెండింగ్ అభివృద్ధి పనులకు వినియోగించాలని ఆదేశించారు. గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు మార్చి 2, 3 తేదీల నుండి జూన్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా శాఖల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ రంగాల్లో ఈ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసి గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, వేసవి తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇటీవల ముగిసిన గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు ఈ 100 డేస్ యాక్షన్ ప్లాన్ దోహదపడుతుందని తెలిపారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సిఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వి. ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# భూ హక్కులు, వ్యవసాయ–పర్యావరణ రిపోర్టింగ్‌పై ఒక్క రోజు శిక్షణ

తెలంగాణ | హైదరాబాద్

సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈఓ, హైదరాబాద్, ఫిబ్రవరి 17: భూ హక్కులు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ అంశాలపై జర్నలిస్టులకు ప్రత్యేకంగా ఒక్క రోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ నెల 18వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. భూ చట్టాలు, భూ సమస్యల పరిష్కారం, వ్యవసాయం మరియు అనుబంధ రంగాల్లో ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, పర్యావరణ పరిరక్షణ, చెరువుల సంరక్షణ, జర్నలిస్టుల నైతిక నియమావళి, మీడియా చట్టాలు, డిజిటల్ రిపోర్టింగ్ తదితర అంశాలపై నిపుణులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. మీడియా రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరచుకుని సమాజానికి నిష్పక్షపాత, బాధ్యతాయుతమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా జర్నలిస్టులు తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకునే అవకాశం లభిస్తుందని కార్యదర్శి వెల్లడించారు. జారీ చేయువారు: కార్యదర్శి, తెలంగాణ మీడియా అకాడమి, హైదరాబాద్.

# న్యాయవాది జి. స్వప్న కుమారి హత్య కేసులో పోలీసుల నిర్లక్ష్యంపై డీజీపీ నివేదిక కోరిన హక్కుల కమిషన్

తెలంగాణ | చేవెళ్ళ

సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈఓ ,హైదరాబాద్, ఫిబ్రవరి 17: చేవెళ్ల పరిధిలో 04.02.2026న చోటుచేసుకున్న భూ వివాద ఘటనలో న్యాయవాది జి. స్వప్న కుమారి దారుణ హత్యను నివారించడంలో మొయినాబాద్ పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (TGHRC) స్పందించింది. డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన 163 మంది న్యాయవాదులు దాఖలు చేసిన ఫిర్యాదు (ఎస్.ఆర్. నం. 515/2026)ను కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. మృతురాలు తన సోదరుడిని నిందితుడిగా పేర్కొంటూ తన ప్రాణాలకు ముప్పు ఉందని ముందుగానే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు సకాలంలో రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ ఘటనను విధి నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యంగా పరిగణించాల్సిన అంశంగా కమిషన్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) నుండి సమగ్ర నివేదిక కోరుతూ, కేసును తదుపరి విచారణ కోసం 06.03.2026కి వాయిదా వేసింది. // ఆదేశానుసారం // ప్రజా సంబంధాల అధికారి, TGHRC.

**తెలంగాణ** అధికంగా కాంగ్రెస్ ఆధిపత్యం, కొన్ని చోట్ల బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీల విజయాలు

# తెలంగాణ మున్సిపాలిటీల్లో కొత్త మేయర్లు, చైర్‌పర్సన్లు బాధ్యతలు స్వీకారం

సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈఓ, హైదరాబాద్, ఫిబ్రవరి 17: తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన మున్సిపాలిటీలు మరియు మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ ఎన్నికలు–2026లో విజయం సాధించిన మేయర్లు, చైర్‌పర్సన్లు, ఉపమేయర్లు మరియు వైస్ చైర్‌పర్సన్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల అధికారులు అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 16న జరిగిన పరోక్ష ఎన్నికల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ సంఖ్యలో స్థానాలను భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా, పలు మున్సిపాలిటీల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), భారతీయ జనతా పార్టీ (బీజేపీ), ఎంఐఎం, సీపీఐ, సీపీఎం, స్వతంత్ర అభ్యర్థులు కూడా గెలుపొందారు. నల్గొండ, సంగారెడ్డి, సూర్యాపేట, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో కొత్త ప్రజాప్రతినిధులు పదవీకాలాన్ని ప్రారంభించగా, వారి పదవీకాలం 15 ఫిబ్రవరి 2031 వరకు కొనసాగనుంది. రాష్ట్రంలోని పట్టణాభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ సంక్షేమ పథకాల అమలులో ఈ కొత్త మేయర్లు, చైర్‌పర్సన్లపై ప్రజల ఆశలు నెలకొన్నాయి. స్థానిక సంస్థల బలోపేతానికి, పట్టణాల సమగ్ర అభివృద్ధికి ఈ ఎన్నికలు కీలకంగా మారాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రశాంతంగా సూర్యాపేట మున్సిపాలిటీ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం, చైర్మన్‌గా మొరిశెట్టి నివేదిత వైస్ చైర్మన్‌గా ఎండి షఫీ ఉల్లా ఎన్నిక ఏకగ్రీవం





సందేశం టైమ్స్ సూర్యాపేట ప్రతినిధి,సూర్యాపేట, ఫిబ్రవరి 17: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్యాపేట మున్సిపాలిటీ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఎన్నిక అధికారి సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు, సహాయ ఎన్నిక అధికారి మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఉదయం 10:45 గంటలకు నూతనంగా ఎన్నికైన 48 మంది కౌన్సిలర్లు హాజరై, మున్సిపల్ రిజిస్టర్‌లో తమ పేర్లు నమోదు చేసి సంతకాలు చేశారు. అనంతరం వారితో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించారు.తదుపరి మాస్టర్ ట్రైనర్ రమేష్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక విధానం పై కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు జరిగిన ఎన్నికలో 46వ వార్డు సభ్యురాలు మొరిశెట్టి నివేదిత పేరును 44వ వార్డు సభ్యురాలు గుణగంటి హేమ ప్రతిపాదించగా, 31 మంది కాంగ్రెస్ సభ్యులు మరియు ముగ్గురు ఇండిపెండెంట్ సభ్యులు మద్దతు తెలపడంతో ఆమె ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నికయ్యారు.అలాగే 41వ వార్డు సభ్యుడు మహమ్మద్ షఫీ ఉల్లా పేరును 33వ వార్డు సభ్యుడు నాగుల శ్రీనివాస్, 30వ వార్డు సభ్యురాలు నామ అరుణ ప్రతిపాదించగా, 31 మంది కాంగ్రెస్ సభ్యులు, ముగ్గురు ఇండిపెండెంట్లు మద్దతు ఇవ్వడంతో ఆయన వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎన్నిక అధికారులు ఆర్డీవో వేణు మాధవరావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి లు చైర్మన్ మొరిశెట్టి నివేదిత, వైస్ చైర్మన్ ఎండి షఫీ ఉల్లాలకు పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# దళితులను రక్షించేందుకు జాతీయ ఎస్సీ కమిషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది, కర్ల రాజేష్ హత్య కేసుపై అధికారులపై జాతీయ ఎస్సీ కమిషన్ ఆగ్రహం





సందేశం టైమ్స్ సూర్యాపేట ప్రతినిధి సూర్యాపేట, ఫిబ్రవరి 16: దళితుల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్ర రావు స్పష్టం చేశారు. సోమవారం కోదాడ పట్టణంలో ఇటీవల పోలీసు లాకప్ డెత్‌కు గురైన కర్ల రాజేష్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ తల్లి లలితమ్మను కలుసుకుని ఘటనకు గల కారణాలను వివరంగా తెలుసుకున్నారు.ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్ పత్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అడిషనల్ డీజీ డి.ఎస్. చౌహాన్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సమక్షంలో లలితమ్మకు అందజేశారు.తదుపరి కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ, కర్ల రాజేష్ కేసును పత్రికల ద్వారా గమనించి కమిషన్ సుమోటోగా నమోదు చేసిందన్నారు. కమిషన్ జోక్యం చేసుకున్న తరువాతే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు.రాజేష్ మృతిపై ఇప్పటివరకు చార్జిషీట్ ఎందుకు దాఖలు చేయలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చార్జిషీట్ వెంటనే దాఖలు చేయాలని ఆదేశించామని తెలిపారు. కేసులో బాధ్యులైన సీఐపై చర్యలు తీసుకోవడంతో పాటు ఎస్సైపై కూడా తక్షణ చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ, జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. పది రోజుల్లో రీ-పోస్ట్‌మార్టం నిర్వహించి నివేదిక సమర్పించాలని సూచించారు.1989 ఎస్సీ, ఎస్టీ చట్టం సెక్షన్ 4 ప్రకారం కమిషన్ ఆదేశాలను పాటించకపోతే సంబంధిత అధికారులపై నిర్లక్ష్యపు యాక్ట్ కింద సస్పెన్షన్‌తో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధించే అవకాశముందని హెచ్చరించారు.రాజేష్ తల్లికి పెన్షన్ మంజూరు చేసినట్లు, మూడు రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు లేదా ఉన్న స్థలంలో ఇల్లు నిర్మించేందుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అదనంగా మూడు ఎకరాల భూమి ఇవ్వడానికి కలెక్టర్ అంగీకరించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీ డి.ఎస్. చౌహాన్, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహా, ఆర్డీవో సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ – ఉద్యోగ అవకాశాలు



సందేశం టైమ్స్ సూర్యాపేట ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (TGMFC) ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి గాను ముస్లిం మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులకు Hardware Networking కోర్సులో ఉచిత శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నారు. అర్హతలు: ఆధార్ కార్డు తప్పనిసరి.వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. పట్టణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.00 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షల లోపు ఉండాలి. మీసేవా ద్వారా జారీ చేసిన ఆదాయ ధృవీకరణ పత్రం సమర్పించాలి. విద్యార్హత: కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. గతంలో ప్రభుత్వం ద్వారా వృత్తి విద్యా శిక్షణ పొందిన వారు అనర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన పత్రాలతో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో లేదా Winsole Educational Society, భూమ్ రెడ్డి హాస్పిటల్ పక్కన, తేది 21-02-2026 లోపు కార్యాలయ వేళల్లో దరఖాస్తులు సమర్పించాలి. మరిన్ని వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం, కలెక్టర్ ఆఫీస్‌ను లేదా మొబైల్ నంబర్లు 9492611057, 9666499929లను సంప్రదించవచ్చు – జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ

# సంగారెడ్డి జిల్లాలో ప్రశాంతంగా మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు

## తొమ్మిది మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక పూర్తి – జహీరాబాద్, ఇంద్రేశం వాయిదా





సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి: సంగారెడ్డి, ఫిబ్రవరి 16: సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీలకు నిర్వహించిన ప్రత్యేక సమావేశాలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులతో ముందుగా ప్రమాణ స్వీకారం చేయించి, అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సంగారెడ్డి మున్సిపల్ ప్రత్యేక సమావేశం అధీకృత అధికారి జడ్పీ సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఉదయం 11 గంటలకు సమావేశాలు ప్రారంభమై, తెలుగు అక్షరమాల క్రమంలో సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు కోరం నిర్ధారించుకున్న అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశారు. జిల్లాలోని ఆందోల్–జోగిపేట్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, జిన్నారం, కోహిర్, నారాయణఖేడ్, సదాశివపేట్, సంగారెడ్డి మున్సిపాలిటీలలో ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయి. జహీరాబాద్, ఇంద్రేశం మున్సిపాలిటీలలో కోరం లభించకపోవడంతో ఎన్నికలను 17.02.2026కు వాయిదా వేశారు. ఎన్నికలను పురస్కరించుకుని అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

మున్సిపాలిటీ వారీగా ఎన్నికైన వారు:

ఆందోల్–జోగిపేట్: చైర్మన్ సోమ్మిరెడ్డి కృష్ణారెడ్డి (INC), వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (INC)

గడ్డపోతారం: చైర్‌పర్సన్ గద్దె సుష్మ (BRS), వైస్ చైర్మన్ లక్ష్మ గోని మహేందర్ గౌడ్ (BRS)

గుమ్మడిదల: చైర్మన్ చిన్నపాపాని కుమార్ గౌడ్ (BRS), వైస్ చైర్‌పర్సన్ చిమ్ముల సంధ్య (BRS)

ఇస్నాపూర్: చైర్‌పర్సన్ మోతే సుమలత (BRS), వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల మాధవి (INC)

జిన్నారం: చైర్మన్ నక్కిర్తి యాట జనార్ధన్ (BRS), వైస్ చైర్మన్ వంగెట్టి ప్రతాప్ రెడ్డి (BJP)

కోహిర్: చైర్మన్ ఎం. అశోక్ (INC), వైస్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ హన్నన్ జావిద్ (INC)

నారాయణఖేడ్: చైర్మన్ నగేష్ కుమార్ షట్కార్ (INC), వైస్ చైర్మన్ దారం శంకర్ (INC)

సదాశివపేట్: చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ (INC), వైస్ చైర్మన్ హెచ్. రేణుక (INC)

సంగారెడ్డి: చైర్‌పర్సన్ కూన వనిత (INC), వైస్ చైర్మన్ షేక్ షఫీ అహ్మద్ (INC) , ఇంద్రేశం, జహీరాబాద్ మున్సిపాలిటీలలో ఎన్నికలు రేపటికి వాయిదా పడ్డాయి.

# కోదాడ మున్సిపాలిటీలో పదవుల ఫిఫ్టీ–ఫిఫ్టీ ఫార్ములా తొలి రెండేళ్లు కుసుమ–మల్లీశ్వరి రెడ్డి, తర్వాత సత్యవతి–పద్మావతి బాధ్యతలు



సందేశం టైమ్స్ కోదాడ ప్రతినిధి: కోదాడ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఫిఫ్టీ–ఫిఫ్టీ ఫార్ములా ప్రకారం పంచుకున్నారు. ఇరువర్గాల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు తొలి రెండేళ్లు ఏర్నేని కుసుమ (కమ్మ) చైర్మన్గా, దేవరం మల్లీశ్వరి రెడ్డి వైస్ చైర్మన్గా వ్యవహరించనున్నారు. అనంతరం మూడేళ్లు పార సత్యవతి (మున్నూరు కాపు) చైర్మన్గా, గుండపనేని పద్మావతి (వెలమ) వైస్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించనున్నారు.కుసుమ, మల్లీశ్వరి రెడ్డి ఏకగ్రీవంగా కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. అయితే చైర్మన్ పదవికి పట్టణంలో కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మాజీ సర్పంచ్, సీనియర్ నేత ఏర్నేని వెంకటరత్నం బాబు భార్య కుసుమకు ఒక వర్గం మద్దతు ఉండగా, మంత్రి ఉత్తమ్‌కు అత్యంత సన్నిహితుడైన లక్ష్మీనారాయణ రెడ్డి సమీప బంధువు దేవరం మల్లీశ్వరి రెడ్డి మరో వర్గం మద్దతుతో పోటీలో నిలిచారు.ఇదే సమయంలో బీసీ కోటాలో గత ఎన్నికల్లో చైర్మన్గా పోటీ చేసి, ఈసారి గెలిచిన పార సీతయ్య భార్య సత్యవతి కూడా ఆశావహుల జాబితాలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు అనుచరుడు ప్రగతి ట్రాన్స్‌పోర్ట్ నాగేశ్వరరావు భార్య గుండపనేని పద్మావతి కూడా పోటీ పడ్డారు.

ఏకాభిప్రాయం కోసం మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి కౌన్సిలర్లతో వన్ టు వన్ చర్చలు జరిపినా తుది నిర్ణయం కుదరలేదు. దీంతో సామాజిక సమీకరణాల దృష్ట్యా పదవులను పంచుకోవాలని నిర్ణయించారు. తొలి రెండేళ్లు కమ్మ, రెడ్డి వర్గాలకు; తరువాత మూడేళ్లు మున్నూరు కాపు, వెలమ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అంగీకరించారు.ఈ మేరకు సోమవారం జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయి.

# సీఎం కప్ పోటీల్లో విజేతలకు బహుమతులు






## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపు

సూర్యాపేట | స్పోర్ట్స్

సందేశం టైమ్స్, సూర్యాపేట ప్రతినిధి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. సోమవారం సూర్యాపేటలోని స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో జిల్లాస్థాయి జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పాఠశాల, కళాశాల స్థాయిలోనే విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో సూర్యాపేట జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చేసి జిల్లాకు, తమ విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.వాలీబాల్ జూనియర్స్ (బాయ్స్, గర్ల్స్), కబడ్డీ సీనియర్స్ (మెన్స్, ఉమెన్స్), కోకో జూనియర్స్ (బాయ్స్, గర్ల్స్), అథ్లెటిక్స్ (సబ్ జూనియర్, జూనియర్, సీనియర్), బాస్కెట్‌బాల్ జూనియర్స్ (బాయ్స్, గర్ల్స్), చెస్ సబ్ జూనియర్ (బాయ్స్, గర్ల్స్), క్యారమ్ సీనియర్ (మెన్స్, ఉమెన్స్), బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ (బాయ్స్, గర్ల్స్)తో పాటు బేస్‌బాల్, జూడో, టైక్వాండో విభాగాల్లో విజేతలైన క్రీడాకారులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, జిల్లా స్పోర్ట్స్ అండ్ యువజన సంక్షేమ అధికారి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోతులబోగుడలో చోరీ కలకలం

## రూ.1.80 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు–నగదు అపహరణ

వట్పల్లి, ఫిబ్రవరి 17 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్):సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పోతులబోగుడ గ్రామంలో చోరీ ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఎర్రోల్ల పెంటయ్య (తండ్రి భూమయ్య) ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 15న సాయంత్రం 4 గంటల సమయంలో పెంటయ్య తన భార్య ఎర్రోల్ల రాములమ్మతో కలిసి ఇంటికి తాళం వేసి కొండాపూర్ గ్రామానికి వెళ్లారు. అక్కడ తమ కూతురు హైదరాబాద్‌కు వెళ్లిన విషయం తెలిసి, దంపతులు సంగారెడ్డిలో నివసిస్తున్న కుమారుడు ఎర్రోల్ల అరుణ్ కుమార్ ఇంట్లో రాత్రి బస చేశారు.తేదీ 16న ఉదయం 9 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి గుర్తుతెలియని దుండగులు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు మరియు నగదు అపహరించినట్లు గుర్తించారు.దొంగిలించబడిన వస్తువుల్లో ఒక తులం బంగారు గుండ్లు, ఒక తులం బంగారు చేతికడియం, ఒక తులం బంగారు ఉంగరం, ఒక తులం బంగారు చెవి గెంటీలు, 60 తులాల వెండి కాళ్ల కడియాలు, రెండు జతల పట్ట గోలుసులు (సుమారు 40 తులాలు)తో పాటు నగదు ఉన్నట్లు బాధితుడు తెలిపారు. మొత్తం నష్టం సుమారు రూ.1,80,000గా అంచనా వేశారు.సమాచారం అందుకున్న క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకుని ఆనవాళ్లు సేకరించింది. త్వరలోనే నిందితులను గుర్తించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్.ఐ లవ కుమార్ తెలిపారు. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి హైదరాబాదులో నిరాహార దీక్ష

## రాష్ట్ర ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా నాయకుల డిమాండ్




సంగారెడ్డి, ఫిబ్రవరి 17 (సందేశం టైమ్స్ అన్ని యజకవర్గ ఇన్చార్జి కే మల్లేశం గౌడ్): ఈ రోజు సంగారెడ్డి ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు రాష్ట్ర ప్రభుత్వానికి పిలుపునిచ్చి గీత కార్మికుల హామీలను వెంటనే అమలు చేయాలని, బడ్జెట్‌లో గౌడ కులస్తుల సంక్షేమం కోసం గీత కార్మికుల ఉపాధికి 5000 కోట్లు మంజూరు చేయాలని కోరారు.జిల్లా నాయకులు వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్లను ఇవ్వడం లేదని, ముందుగా ఇచ్చిన హామీ ప్రకారం 4000 మంది కి పెన్షన్ మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 800 మంది కోసం సుమారు 14 కోట్లు ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు, గత బడ్జెట్‌లో కేటాయించిన 70 కోట్లు నిధులను ఖర్చు చేయాలని వారు కోరారు.ఈ నిరాహార దీక్షలో జిల్లా గీత కార్మికులు, గౌడ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమస్యల పరిష్కారానికి జయప్రదమైన పిలుపు ఇచ్చారు.

## మరవెల్లి శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి గుడి వార్షికోత్సవం మఠం బిక్షపతి రూ.50,000 విరాళం అందజేశారు



సంగారెడ్డి, ఫిబ్రవరి 16 (సందేశం టైమ్స్ – అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు): సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం, వట్పల్లి మండలం, మరవెల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి గుడి నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతిని గుడి నిర్వాహకులు ఆహ్వానించారు.కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గుడి అభివృద్ధి కోసం తనవంతు సహాయంగా రూ.50,000 విరాళాన్ని అందజేశారు. గుడి నిర్వాహకులు మన్నే జగదీశ్, మన్నే ఆంజనేయులు, మన్నే శ్రీనివాస్, మన్నే మాణిక్యం తదితరులు ఈ సానుకూల దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం భక్తుల మధ్య భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది.









## మహాశివరాత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్, శ్రీనివాస్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయ చైర్మన్

సంగారెడ్డి, ఫిబ్రవరి 16 ( సందేశం టైమ్స్ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కె. సంగమేశ్వర్ ) ఈరోజు నిజాంపేట్ సర్కిల్ 7వ డివిజన్ పరిధిలో 191ఎన్టీఆర్ నగర్ లో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ బాలా త్రిపురసుందరి దేవి సమేత విశ్వేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల దేవస్థానం & 191 ఎన్టీఆర్ నగర్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో దేవస్థానంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ గారు,శ్రీనివాస్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయ చైర్మన్ కోలన్ చంద్రశేఖర్ రెడ్డి గారు పాల్గొని ప్రత్యేక పూజల్లో నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించడం జరిగింది. వారు మాట్లాడతూ స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలపై స్వామి దీవెనలు తప్పక ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరినట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మాజీ వార్డ్ సభ్యులు కూరాకుల రాము, ఆవుల రాము యాదవ్,శ్రీ బాలా త్రిపురసుందరి దేవి సమేత విశ్వేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల దేవస్థానం కమిటీ సభ్యులు, 191 ఎన్టీఆర్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం: ఎస్.కృష్ణారెడ్డి చైర్మన్, ఆకుల చిట్టిబాబు వైస్ చైర్మన్ : అభినందనలు తెలిపిన మంత్రి దామోదర్





సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి : జోగిపేట: అందోల్–జోగిపేట మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గం సభ్యులు కొలువుదీరారు. చైర్మన్‌గా ఎస్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)లు ఎకగ్రీవంగా ఎన్నికైయ్యారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్‌లుగా గెలుపొందిన సభ్యులను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు కౌన్సిలర్‌ల ప్రమాణ స్వీకారోత్సవం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి అంబదాస్ రాజేశ్వర్ సమక్షంలో జరిగింది. అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులుండగా, ఇందులో 17 వార్డుల్లో కాంగ్రెస్, మూడు వార్డులను బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ మేజార్టీ స్థానాలను గెలుచుకొవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సభ్యుల ప్రమాణస్వీకారం అనంతరం మున్సిపాలిటీ తరపున ఘనంగా సన్మానించారు. అనంతరం రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కొత్తగా ఎన్నికైన సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాణస్వీకారం చేసిన సభ్యులు:అందోలు-జోగిపేట మున్సిపాలిటీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్‌లను ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపాలిటీలో 20 వార్డుల్లో గెలుపొందిన అభ్యర్థులను ముందుగా కౌన్సిలర్‌లుగా జిల్లా సివిల్ సప్లయ్ అధికారి అంబదాస్ రాజేశ్వర్ ప్రమాణ స్వీకారం చేయించారు. 1వ వార్డు అరుణ్ కుమార్, 2వ వార్డు కొశికె రాజశేఖర్, 3వ వార్డు మర అరుణ కుమారి, 4వ వార్డు తిరుమల కల్పన, 5వ వార్డు కొత్తగొల్ల మాధవి, 6వ వార్డు రాచకొండ జ్యోతి ప్రదీప్‌గౌడ్, 7వ వార్డు తొట్ల రామకృష్ణ, 8వ వార్డు నాగ రత్నంగౌడ్, 9వ వార్డు హెచ్.శోభారాణి నారాయణగౌడ్, 10వ వార్డు పి. రేఖా ప్రవీణ్, 11వ వార్డు జీ.కల్పన నాగరాజ్, 12వ వార్డు కొరబోయిన సరస్వతి, 13వ వార్డు పి.శివశేఖర్, 14వ వార్డు పి.ఉర్మిళ దుర్గయ్య, 15వ వార్డు ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు, 16వ వార్డు పి.శ్రీనివాస్, 17వ వార్డు నేనావత్ మేఘరాణి, 18వ వార్డు బేగరి శశిరేఖ అనిల్, 19వ వార్డు అల్లె మంజుల శ్రీకాంత్, 20వ వార్డు సోమిరెడ్డి గారి కష్ణారెడ్డి కౌన్సిలర్‌లుగా గెలుపొందారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. చైర్మన్‌గా 20వ వార్డు కౌన్సిలర్ ఎస్.కృష్ణారెడ్డి పేరును 7వ వార్డు కౌన్సిలర్ తొట్ల రామకృష్ణ ప్రతిపాదించగా, 10వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల రేఖా ప్రవీణ్ ఆమోదించారు. వైస్ చైర్మన్‌గా 15వ వార్డు కౌన్సిలర్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) పేరును 2వ వార్డు కౌన్సిలర్ కొశికె రాజశేఖర్ ప్రతిపాదించగా, 16వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల శ్రీనివాస్ ఆమోదించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లకు పోటీ ఎవ్వరూ లేకపోవడంతో ఏకగ్రీవంగా చైర్మన్, వైఎస్ చైర్మన్‌ల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం వీరిచేత ప్రమాణస్వీకారం చేయించారు. అభినందనలు తెలిపిన మంత్రి దామోదర్

అందోలు-జోగిపేట, అందోల్ మున్సిపాలిటీలో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ సభ్యులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహను కలిశారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు కొత్త పాలకవర్గ సభ్యులకు మంత్రి అభినందనలను తెలియజేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీనిచ్చారు. పార్టీలకు అతీతంగా మన ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. కొత్తగా గెలుపొందిన సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలను అందించాలని, ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అర్హులైన వారందరికి అందేలా చూడాల్సిన బాధ్యత మీపైన ఉందన్నారు. అనంతరం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు కొత్త పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలను తెలియజేశారు.

## కోట సంగన్నలో ఆత్మలింగ సంస్థాన్ పూజారి ఘన కార్యక్రమం



రాయికోడ్, ఫిబ్రవరి 17 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): కోట సంగన్నలో ఆత్మలింగ సంస్థాన్ పూజారి ఘన కార్యక్రమం ఈరోజు ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్ర వీరశైవ లింగాయట్ లింగ బలిజ సంఘ అధ్యక్షులు పవన్ కుమార్, నాగేష్, మదయ్య స్వామి, మల్లేశం, నారాయణ పంతులు తదితర ప్రముఖులు పాల్గొని ఉత్సవానికి ప్రత్యేక వైభవం జోడించారు. స్థానిక భక్తులు, సామాజిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు జయప్రదంగా సాగించగా, కార్యక్రమం శాంతియుత, ఆధ్యాత్మిక వాతావరణంలో ముగిసింది.



## కన్‌సాన్‌పల్లిలో ఉచిత రక్తదాన శిబిరం విజయవంతం

అందోల్, ఫిబ్రవరి 17 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): అందోల్ మండల్ కన్‌సాన్‌పల్లి గ్రామంలో ధీరజ్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, జోగిపేట లయన్స్‌క్లబ్ సహకారంతో ఉచిత రక్తదాన శిబిరం సోమవారం విజయవంతంగా నిర్వహించబడింది. ప్రధాన అతిథిగా జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మెన్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన రక్తదానం ప్రాణాలను కాపాడుతుందని, ప్రతి వ్యక్తి మూడు నెలలకొకసారి రక్తదానం చేయాలని, వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, యువతలో మానవతా విలువలు పెరుగుతాయని చెప్పారు.సుమారు 50 మంది గ్రామ యువకులు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకొచ్చారు. రక్తదాన సర్టిఫికేట్లను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ కేంద్రం అధికారులు అందజేశారు.కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు రవిశేఖర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ పీఆర్ఓ డాక్టర్ అనంతరెడ్డి, లయన్స్ సభ్యులు, ఏయంజీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, వార్డు సభ్యులు, సంఘం జిల్లా నాయకులు మరియు స్థానికులు పాల్గొన్నారు

## నూతన ప్రమాణ స్వీకార మహోత్సవంలో 13వ వార్డు కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని హామీ



తెలంగాణ | సంగారెడ్డి

అందోల్–జోగిపేట్, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్ – అందోల్ మండల్ రిపోర్టర్ వి. వెంకటేశం): అందోల్ మున్సిపాలిటీ నూతన ప్రమాణ స్వీకార మహోత్సవంలో 13వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, "ఎలాంటి ఆపద వచ్చినా ముందుండి నడిపిస్తాను, ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం" అని హృదయపూర్వకంగా తెలిపారు. తనను విశ్వసించి ఓటు వేసి గెలిపించిన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పట్లూరి శివశేఖర్, వార్డు అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానికులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కౌన్సిలర్ అభివృద్ధి సంకల్పాన్ని ఉత్సాహంగా స్వీకరించారు.

## మున్సిపాలిటీ నూతన ప్రమాణ స్వీకార మహోత్సవంలో 8వ వార్డు కౌన్సిలర్ నాగరత్నం గౌడ్ అభివృద్ధి సంకల్పం




అందోల్–జోగిపేట్, ఫిబ్రవరి 17 (సందేశం టైమ్స్ – అందోల్ మండల్ రిపోర్టర్ వి. వెంకటేశం): అందోల్ మున్సిపాలిటీలో నిర్వహించిన నూతన ప్రమాణ స్వీకార మహోత్సవంలో 8వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నాగరత్నం గౌడ్ పాల్గొన్నారు. ఆయన భావోద్వేగంగా మాట్లాడుతూ, తన వార్డును అభివృద్ధి బాటలో నడిపించడం తన ప్రథమ కర్తవ్యమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం తన ప్రధాన లక్ష్యమని, ఎలాంటి ఆపద వచ్చినా ముందుండి సేవ చేస్తానని స్పష్టం చేశారు. తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన వార్డు ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు.




## అందోల్–జోగిపేట్ నూతన మున్సిపాలిటీ ప్రమాణ స్వీకారంలో 1వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ గడ్డం అరుణ్ కుమార్ అభివృద్ధి సంకల్పం

అందోల్–జోగిపేట్, ఫిబ్రవరి 17 (సందేశం టైమ్స్ – అందోల్ మండల్ రిపోర్టర్): అందోల్–జోగిపేట్ మున్సిపాలిటీలో నిర్వహించిన నూతన ప్రమాణ స్వీకార మహోత్సవంలో 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గడ్డం అరుణ్ కుమార్ భావోద్వేగ ప్రసంగం చేశారు. తన వార్డును సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం తన ప్రథమ కర్తవ్యమని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి ఆపద వచ్చినా ముందుండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు.తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన వార్డు ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా పనిచేస్తానని గడ్డం అరుణ్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో తొమ్మిది మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు పూర్తి – జహీరాబాద్, ఇంద్రేశం ఎన్నికలు వాయిదా



2ND ORDINARY ELECTIONS TO MUNICIPALITIES & MUNCIPAL CORPORATIONS 2026
PROFORMA XIV
REPORT ON INDIRECT ELECTION OF CHAIRPERSON, VICE CHAIRPERSON OF MUNICIPALITIES

| Sl No. | Name of the Municipality | Chairperson reserved for | Person declared elected as Chairperson | Party Affiliation if any | Person declared as Vice Chairperson | Party Affiliation if any | Remarks |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Andole-Jogipet | UR (General) | Sri.Krishnareddy Sommireddy Gari | INC | Sri.Akula Satyanarayana | INC | |
| 2 | Gaddapotharam | SC (Women) | Smt.Gadde Sushma | BRS | Sri.Lakshmagouni Mahendar Goud | BRS | |
| 3 | Gummadidala | BC (General) | Sri.Chinnapapani Kumar Goud | BRS | Smt.Chimmula Sandhya | BRS | |
| 4 | Indresham | | | | | | Postponed to 17.02.2026 due to no Quorum |
| 5 | Isnapur | UR (Women) | Smt. Mote Sumalatha | BRS | Smt. Patlolla Madhavi | INC | |
| 6 | Jinnaram | BC (General) | Sri. Nakkirthi Yata Janardhan | BRS | Sri Vangetti Prathap Reddy | BJP | |
| 7 | Kohir | SC (General) | Sri.M.Ashok | INC | Sri.Mohammad Abdul Hannan Javeed | INC | |
| 8 | Narayankhed | Unreserved | Sri. Nagesh Kumar Shetkar | INC | Sri.Daram Shankar | INC | |
| 9 | Sadasivapet | UR (Women) | Smt. Munipally Anjamma | INC | Smt.H.Renuka | INC | |
| 10 | Sangareddy | UR (Women) | Smt. Kuna Vanitha | INC | Sri.Shaik Shafi Ahmed | INC | |
| 11 | Zahirabad | | | | | | Postponed to 17.02.2026 due to no Quorum |

Addl.Dist Election Authority
& Addl.Collector Local Bodies
Sangareddy District

సంగారెడ్డి, ఫిబ్రవరి 17 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీలకు ప్రత్యేక సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మార్గనిర్దేశంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.సంగారెడ్డి మున్సిపల్ సమావేశాన్ని జడ్పీ సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఉదయం 11 గంటలకు అన్ని మున్సిపాలిటీలలో ప్రత్యేక సమావేశాలు ప్రారంభమై, కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. మధ్యాహ్నం 12:30 గంటలకు సరిపడ కోరం గుర్తించిన తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల ఎన్నికలు నిబంధనల మేరకు పూర్తి చేసి, అధికారికంగా ప్రకటించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మున్సిపాలిటీల వివరాలు:

ఆందోల్-జోగిపేట్: చైర్మన్ సోమ్మిరెడ్డి గారి కృష్ణారెడ్డి (INC), వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (INC).గడ్డపోతారం: చైర్మన్ శ్రీమతి గద్దె సుష్మ (BRS), వైస్ చైర్మన్ లక్ష్మ గోని మహేంద్ర గౌడ్ (BRS) గుమ్మడిదల: చైర్మన్ చిన్న పాపాని కుమార్ గౌడ్ (BRS), వైస్ చైర్మన్ శ్రీమతి చిమ్ముల సంధ్య (BRS) ఇస్నాపూర్: చైర్మన్ శ్రీమతి మోతే సుమలత (BRS), వైస్ చైర్మన్ శ్రీమతి పట్లోళ్ల మాధవి (INC) జిన్నారం: చైర్మన్ నక్కిర్తి యాట జనార్ధన్ (BRS), వైస్ చైర్మన్ వంగెట్టి ప్రతాప్ రెడ్డి (BJP) కోహీర్: చైర్మన్ ఎం. అశోక్ (INC), వైస్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ హన్నన్ జావిద్ (INC) నారాయణఖేడ్: చైర్మన్ నగేష్ కుమార్ షట్కార్ (INC), వైస్ చైర్మన్ దారం శంకర్ (INC) సదాశివపేట్: చైర్మన్ శ్రీమతి మునిపల్లి అంజమ్మ (INC), వైస్ చైర్మన్ శ్రీమతి హెచ్. రేణుక (INC) సంగారెడ్డి: చైర్మన్ శ్రీమతి కూన వనిత (INC), వైస్ చైర్మన్ షేక్ షఫీ అహ్మద్ (INC) జహీరాబాద్, ఇంద్రేశం మున్సిపాలిటీలలో సరిపడా కోరం లేని కారణంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను 17 ఫిబ్రవరికి వాయిదా చేశారు. ఎన్నికలను పురస్కరించుకొని, అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వట్పల్లిలో ఖ్వాజా షరీఫ్ దర్గా 40వ ఉర్సు ఉత్సవం ఘనంగా – మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరు





వట్పల్లి,ఫిబ్రవరి 17( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్)సంగారెడ్డి జిల్లా, వట్పల్లి మండల కేంద్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దర్గా ఎ హజ్రత్ సయ్యద్ షా ఖ్వాజా దాస్ ఖాజా షరీఫ్లో 40వ వార్షిక ఆరాధన మహోత్సవం (ఉర్సు ఉత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మంత్రి దర్గా ను దర్శించుకుని ఖ్వాజా షరీఫ్ దర్గా కు చద్దర్ సమర్పించారు. అనంతరం దర్గా ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోరుకున్నారు.కార్యక్రమం అనంతరం సామూహిక భోజనశాలలో నేలపై కూర్చొని భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ తన నిరాడంబరతను చాటుకున్నారు.ఉర్సు ఉత్సవం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రార్థనలు నిర్వహించారు.స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సరాపుపల్లి వద్ద పోలీస్ వాహనానికి లారీ ఢీ జోగిపేట ఎస్సై పాండుగౌడ్‌కు స్వల్ప గాయాలు



అందోల్, ఫిబ్రవరి 17 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) – సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల్ పరిధిలోని సరాపుపల్లి గ్రామం వద్ద సోమవారం తెల్లవారుజామున పోలీస్ వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో జోగిపేట ఎస్సై పాండుగౌడ్ స్వల్పంగా గాయపడ్డారు.పోలీసుల వివరాల ప్రకారం, ఉదయం సుమారు 3 గంటల సమయంలో జోగిపేట నుంచి సంగారెడ్డి వైపు పోలీసులు ప్రయాణిస్తున్న పోలీసులు వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఢీ కారణంగా పోలీస్ వాహనం తీవ్రంగా దెబ్బతింది, ఎస్సై పాండుగౌడ్ స్వల్ప గాయాలతో బయటకు వచ్చారు.తక్షణం గాయపడిన ఎస్సైను సంగారెడ్డిలోని వెల్‌నెస్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.పోలీసులు ఘటనా స్థలంలో పరిశీలనలు జరిపి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న లింగమయ్యను గ్రామ నేతలు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు



వట్పల్లి, ఫిబ్రవరి 17 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్) – సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం స్వగ్రామానికి చెందిన లింగమయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి, గ్రామ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.గ్రామ సర్పంచ్ నాగమణి నర్సింలు, మాజీ ఎంపీటీసీ నవీన సదానందం, గ్రామ పార్టీ అధ్యక్షులు మల్లేశం సుశీల్, వట్పల్లి మండల మైనార్టీ అధ్యక్షులు షాబుద్దీన్ కలిసి లింగమయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ఆరుగొండ అనిల్ కుమార్ పటాన్చెరువుకు వెళ్లి లింగమయ్య కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ నేతలు బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.